www.jananinadam.com

Follow :

జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

గురువారం 29-10-2026

సంపుటి : 2 సంచిక : 171

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 06

వెల: రూ.2.00

Simultaneously published from
,Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com



ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట

- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ

- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

హైదరాబాద్,: ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామా రావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభిం చింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసా గించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు...

క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి

భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి

తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 28: రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో వని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శు



తెలంగాణలో భారీగా.. ఐపీఎస్‌ల బదిలీలు

2వ పేజీలో...

- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం

- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్

- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

హైదరాబాద్,: తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధి కారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు.



అర్నబ్ అతి తీవ్ర తుపాను ధాటికి కోనసీమ జిల్లా అతలాకుతలం





ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే.. ఏఐ వినియోగ లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్,28 : ఏఐతో ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యమని పేర్కొన్నా రు. 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో భట్టి విక్రమార్క బుధవారం పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచాలని అధికారుల ను ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని దిశానిర్దే శం చేశారు. ఆయా కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు కేటాయించాలని సూచించారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి..: రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకే 'ఏఐ సాక్షమ్'ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణకు ఏఐ ఉపయో గపడుతుందని వివరించారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్

- కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ

2వ పేజీలో...

- 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా విస్మరించారని ఆగ్రహం



దాడులు ఆపితే 9500 కోట్లు ఇస్తాం!

2వ పేజీలో...

హౌతీలకు సౌదీ బంపర్ ఆఫర్

రియాద్ : యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో ఉక్కి రిబిక్కిరవుతున్న సౌదీ అరేబియా వారితో ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు ముందుకు వచ్చినట్టు సమాచారం. తమ దేశంపై దాడి చేయకుండా ఉండేందుకు హౌతీ రెబల్స్‌కు రూ.9,500 కోట్లను ఇవ్వడానికి సౌదీ సిద్ధమైనట్టు తెలిసింది. సౌదీ రక్షణ శాఖ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ ఈ విషయమై చర్చలు జరపడానికి సోమవారం బెహ్రాన్‌కు చేరుకున్నారని మీడియా తెలిపింది. మంత్రి వినియోగించిన హెర్క్యులెస్ మిలిటరీ విమానంలోనే ఈ సొమ్ము తీసుకువచ్చినట్టు పేర్కొంది.సౌదీ రక్షణ శాఖ భవనంపై క్షిపణి దాడి: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై బాలిస్టిక్ క్షిపణితో నేరుగా దాడి చేసినట్టు హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. అయితే ఈ వాదనను నిర్ధారించే ఆధారాలు లేవు. మరోవైపు, హౌతీలు ప్రయోగించిన రెండు క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్టు సౌదీ అరేబియా ప్రకటించింది. తమ సైనిక బలగాలు

రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా..



మహేశ్‌గౌడ్, పొన్నం సహా పలువురు అరెస్ట్

హైదరాబాద్: నవంబర్ 1న దిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ నిరాకరించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, దానం నాగేందర్ తదితరులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రైల్ నిలయంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.



వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు.. శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

2వ పేజీలో...

- జపాన్ సైన్యానికి భారత్‌లో శిక్షణ ఇచ్చేందుకు యత్నాలు

- ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై తర్ఫీదు

- వెయ్యి కిలోమీటర్ల రేంజ్ మిస్సైళ్లకు జపాన్‌లో శిక్షణ కష్టతరం

- భారత్‌తో చర్చలకు సిబ్బందిని పంపామన్న జపాన్ జనరల్

- ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలు బలోపేతం చేసేందుకే ఈ చర్య

కమలానికి దారేది..?



హైదరాబాద్, : తెలంగాణ ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తు న్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదు గుతున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఏకైక లేదా సంపూర్ణ ప్రత్యామ్నాయంగా మారడానికి ఇంకా మిశ్రమ ఫలి తాలు, సవాళ్లు ఎదుర్కొంటోంది. 20 24 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు సాధించి 35 శాతం ఓట్లతో బలమైన పునాది వేసుకున్నప్పటికీ, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే వెనుకబడి మూడో స్థానానికే పరిమితమైంది. ప్రజల్లో మరియు రాజకీయ క్షేత్రంలో బీజేపీ స్థానాన్ని పదిలం చేసుకునే ప్రయత్నిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఎనిమిది స్థానాలు, పెరిగిన ఓట్ల శాతం ఆ పా ర్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. కొన్నిపట్టణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రజలు కేంద్రంలో మోదీ నాయక త్వాన్ని చూసి ఓటేశారు. ప్రధాన ప్రతి పక్షంగా ఎదిగే ప్రయత్నం అప్పటి నుంచే మొదలు పెట్టింది.

రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు...

మొదటిపేజీ తరువాయి...

ద్ది చేసిన నీటిని సెక్రటేరియట్ తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్ , మైట్రో రైల్ , ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్ లు, రోడ్ల శుభ్రత కు కూడా ట్రీటెడ్ వాటర్ నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ అతి తీవ్ర తుపాను ధాటికి కోనసీమ జిల్లా అతలాకుతలం

- గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు.. కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వేలాది ఎకరాల్లో కొబ్బరి, అరటి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం
- ఒక్క కోనసీమలోనే దాదాపు 6000 విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన వైనం
- రహదారుల క్లియరెన్స్, విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం



అమలాపురం,: అర్నబ్ తుపాను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర విధ్వంసం సృష్టించింది.గంటకు 100కిలోమీటర్లకు పైబడిన వేగంతో వీచిన ప్రచండ గాలులకు జిల్లాలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఈ గాలుల ధాటికి వేలాదిగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను తీరం దాటే సమయంలో కోనసీమ, నర్సాపురం ప్రాంతాల్లో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగం తో గాలులు వీచినట్లు అధికారులు అంచనా వేశారు. అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అంబాజీపేట, పి.గన్నవరం, రాజోలు, అయినవిల్లి, మామిడికుదురు సహా పలు మండలాల్లో తుఫాను ప్రభావం అత్యధికంగా కనిపించింది. రాజోలు, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, మల్కిపురం మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది.

మొదటిపేజీ తరువాయి...

ఈ విపత్తు కారణంగా వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కొబ్బరి, అరటి, బొప్పాయి చెట్లు భారీ సంఖ్యలో విరిగిపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ధాటికి ఒక్క కోనసీమ జిల్లాలోనే దాదాపు 6,000 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో జిల్లాలోని అనేక గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. రాజోలు–అమలాపురం మార్గంలో భారీ వృక్షాలు కూలిపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రస్తుతం అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. విరిగిపడిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. అదే సమయంలో రహదారులపై పేరుకుపోయిన చెట్లను, ఇతర అడ్డంకులను తొలగించి రవాణాను సాధారణ స్థితికి తీసుకువచ్చే పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు..

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,: భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతు న్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేం దుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావి స్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్ల డించారు. సుమారు 1,000 కిలోమీ టర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవ ంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరా య్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీ యంగా, విదేశాల్లో శిక్షణా అవకాశా లను వరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. కేవలం క్షిపణులే కాకుండా, చిన్న తరహా అటాక్ డ్రోన్ల ప్రయోగానికి గల అవకాశాలపై కూడా చర్చిస్తు న్నట్లు ఆయన ధ్రువీకరించారు. సంక్లిష్టంగా మారిన భద్రతా వాతావరణంలో ఇండో–పసిఫిక్‌లో భారత్‌ను జపాన్ ఒక ముఖ్యమైన భాగస్వామిగా చూస్తోందని, రక్షణ సహకారాన్ని మరింత పటిష్ఠం..చేసుకోవాలని కోరుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, భారత్‌తో



ఉన్న సంబంధాల సున్నితత్వం దృష్ట్యా పూర్తి వివరాలను వెల్లడించలేనని జనరల్ అరాయ్ పేర్కొన్నారు. కాగా, ఈ నెల 6 నుంచి 9 వరకు జపాన్ జీఎస్‌డీఎఫ్ కమాండ్ నుంచి 34 మంది సభ్యుల ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించింది. ఈ బృందం భారత సైన్యం, డీఆర్‌డీవో అధికారులతో సమావేశమైంది. వార్‌డెక్, క్లావ్స్ వంటి కేంద్రాలను సందర్శించి భారత రక్షణ సామర్థ్యాలు, సైనిక శిక్షణ, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకున్నారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వృత్తిపరమైన సైనిక సంబంధాలను మరింతగా పెంచేందుకు దోహదపడింది.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

మొదటిపేజీ తరువాయి...



హైదరాబాద్,: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు



మొదటిపేజీ తరువాయి...

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీవీస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో, లేదో గుర్తించవచ్చని చెప్పుకొచ్చారు. విద్యుత్ డిమాండ్ అంచనా, వరికరాల లోపాల గుర్తింపులో ఏఐ కీలకంగా పయోగపడుతుందని వెల్లడించారు.ఏఐతో సమయం ఆదా..: ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో ఏఐతో సమయం ఆదా అవుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఏఐ ఇచ్చే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. ఏఐ వినియోగంలో తప్పులకు బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టత ఉండాలని అన్నారు. చిన్నస్థాయి ప్రయోగాల తర్వాతే ఏఐ వ్యవస్థల విస్తరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలే ఏఐ విజయానికి కొలమానమని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

కమలానికి దారేది..?



మొదటిపేజీ తరువాయి...

బీఆర్ఎస్ బలహీనపడిన సమయాల్లో, కాంగ్రె స్‌కు తామే అసలైన ప్రత్యామ్నాయం అని, హైడ్రా వంటి ప్రజా వ్యతిరేకత ఉ న్న అంశాలపై పోరాడుతూ బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. 2026 ప్రారంభం లో జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ ఘన విజయం సాధించగా, బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ దాదాపు 20శాతం ఓట్లను కోల్పోయి మూడో స్థానానికి పడిపో యింది. స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల బీజేపీ కేవలం ఓట్లను చీల్చే 'స్పాయిలర్' గానే మారిందని విశ్లేష కులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్, ప్రజాకర్షణ గల స్థానిక నాయకులు లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్. అలాగే తెలంగాణ ప్రాంతీయ సెంటిమెంట్‌కు, బీజేపీ జాతీయవాద విధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసం కూడా ప్రభావం చూపుతోంది. కాం గ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలన, అవినీతితో ప్రజలు విసిగిపోయారని, సర్వేల ప్రకారం తామే రాబోయే కాల ంలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని, ఏకైక ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొంటు న్నారు.. తెలంగాణలో ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు నాయకత్వా న్ని కూడా పెంచుకోవడం బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి రానున్న కాలంలో సవాల్ అని చెప్పక తప్పదు. ప్రజలు కూడా బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తే కమలం పార్టీకి అధికారం చేరువవుతుంది. తెలంగాణలో పోటీ ఎప్పుడూ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, బీజేపీ ఎప్పటికీ ప్రత్యామ్నా యం కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి వారు అంటున్నప్పటికీ ప్రజలు ఇచ్చే తీర్పునకు అందరూ కట్టుబడి ఉండాల్సిందే. ప్రస్తుతానికి తెలంగాణ ప్రజలు బీజేపీని ఒక బలమైన శక్తిగా గుర్తిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి అధికార ప్రత్యామ్నాయంగా మార్చడానికి ఇంకా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ చెబుతుండటంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారనుంది. అందుకు అవసరమైన కసరత్తును ఇప్పటి నుంచే ప్రారంభించాల్సిన అవసరం ఉంది.నవంబర్ లో షా టూర్ : తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంటోం ది. అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, అధికార పీఠమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. రాష్ట్రస్థాయి నేతలు తమ వంతు పోరాటం చేస్తున్నారు. అయితే ఇది సరిపోవట్లేదని పార్టీ హైకమాండ్ భావిస్తోందో ఏమో.. నేరుగా పార్టీ పెద్దలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో పర్యటించబోతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కొంత మేర డీలా పడింది. ఆ పార్టీకి అంతర్గత సమస్యలూ చుట్టుముట్టాయి. ప్రధాన ప్రతిపక్షంగా దూకుడు ప్రదర్శించాల్సిన గులాబీ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడలేకపోతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ శూన్యతను ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్‌కు ఏకైక బలమైన ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవాలని బీజేపీ హైకమాండ్ గట్టిగా భావిస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దాన్ని క్యాష్ చేసుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, విద్యుత్ రంగ సవాళ్లు, రైతు రుణమాఫీ అమలులో సాంకేతిక లోపాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును బీజేపీ తీవ్రంగా ఎండగడుతోంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. ఎన్నికల వరకూ వేచి చూడకుండా, రెండేళ్ల ముందే కేడర్‌ను సమరశంఖానికి సిద్ధం చేయడం ద్వారా ప్రత్యర్థి పార్టీలను ఆత్మరక్షణలోకి నెట్టాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.నవంబర్‌లో హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. ఆయన పూర్తిగా సంస్థాగత ప్రక్షాళనపైనే దృష్టి పెడతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బూత్ స్థాయి కమిటీల పనితీరు, నాయకుల మధ్య సమన్వయం, సోషల్ మీడియా నెట్‌వర్క్ పటిష్టతపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీలో అసమ్మతికి తావులేకుండా, క్షేత్రస్థాయిలో కష్టపడే సాధారణ కార్యకర్తలకు పెద్దపీట వేసేలా ఆయన నేరుగా బూత్ స్థాయి సైనికులకు మార్గదర్శనం చేయనున్నారు. పార్టీ క్యాడర్‌లో జోష్ నింపడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.డిసెంబర్‌లో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టతనివ్వడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పేందు కు ప్రయత్నిస్తోంది.తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు లేకుండా, భవిష్యత్తులో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే ముఖాముఖి పోరును సృష్టిం చడమే బీజేపీ అసలు లక్ష్యంగా ఉంది. బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కే మేలు జరుగుతుందనే ప్రచారాన్ని ప్రజల మెదళ్లలో నాటడం ద్వారా ఓట్ల చీలికను నివారించవచ్చని భావిస్తున్నారు. ఏదేమైనా ఢిల్లీ అగ్రనేతల వరుస పర్యటనలతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కబోతున్నాయి.

దాడులు ఆపితే 9500 కోట్లు ఇస్తాం!

మొదటిపేజీ తరువాయి...

రియాద్‌లోని సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖను లక్ష్యంగా చేసుకొని బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించాయని హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరియా సామాజిక మాధ్యమంలో వెల్లడించారు. లక్ష్యాన్ని క్షిపణి నేరుగా తాకిందని పేర్కొ న్నారు. అయితే ఈ దాడిలో రక్షణ శాఖ భవనానికి నష్టం వాటిల్లిందా? ప్రాణనష్టం జరిగిందా? అనే వివరాలు స్పష్టంగా తెలియరాలేదు. మరోవైపు సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం రాస్ తనూరా రిఫైనరీపైనా క్షిపణి దాడి చేసినట్టు హౌతీలు ప్రకటించారు. ఈ దాడితో అక్కడ మంటలు చెలరేగినట్టు పేర్కొన్నారు.

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట

మొదటిపేజీ తరువాయి...

ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా..

మొదటిపేజీ తరువాయి...

దీంతో రైల్ నిలయం వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధర్నా చేస్తున్న నాయకులను అరెస్టు చేసి మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. 6 రోజుల క్రితమే ఎంపీ అనిల్ యాదవ్ రైల్వే జీఎంను కలిసి తమ నిరసన కార్యక్రమానికి రెండు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నిన్నటి వరకు కాలయాపన చేసిన రైల్వే అధికారులు సానుకూలంగా ఉన్నట్లు నమ్మించి.. చివరికి అనుమతి నిరాకరిస్తున్నట్లు నిన్న రాత్రి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో కాంగ్రెస్ నాయకులు ఆగ్రహానికి గురై రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా దిల్లీలో నిరసన కార్యక్రమానికి హాజరవుతామని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

ఆర్‌టీఐ సెక్షన్లపై పూర్తి అవగాహన ఉండాలి

నిర్ణీతగడువులో సమాచారమివ్వాలి..
పారదర్శకతకు పెద్దపీట
రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్‌రెడ్డి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: సమాచార హక్కు చట్టంలోని ప్రతి సెక్షన్‌పై అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. చట్టంపై అవగాహన ఉన్నప్పుడే దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారం అందించగలమని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమాచార హక్కు చట్టం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్‌టీఐ దరఖాస్తులపై అధికారులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, వాటిలో కోరిన అంశాలను పూర్తిగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అందించాల్సిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంపొందించడంతోపాటు, అధికారులు, ఉద్యోగులు జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని నిబంధనలకు విరుద్ధంగా వెల్లడించరాదని పేర్కొన్నారు.

పారదర్శకతే లక్ష్యం...

సంస్థల విధులు, బాధ్యతలు, అధికారుల విధులు, నిర్ణయాలు తీసుకునే విధానం, పర్యవేక్షణ తదితర అంశాల్లో పారదర్శకత ఉండాలని ప్రధాన కమిషనర్ తెలిపారు. ప్రపంచంలోని 132 దేశాల్లో సమాచార హక్కు చట్టం అమలులో ఉందని పేర్కొన్నారు.
కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ సమాచార కమిషనర్లు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పౌరులకు సకాలంలో సమాచారం అందించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచడం, ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామన్నారు.

దరఖాస్తులపై విచారణ..

కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మోసిన పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవి మెర్లతోపాటు జిల్లా కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి పాల్గొన్నారు. ఆర్‌టీఐ చట్టంలోని వివిధ సెక్షన్లపై కమిషనర్లు వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం కింద దాఖలైన అప్పీళ్లపై విచారణ నిర్వహించారు.
అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు



విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి...

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యతోపాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 18 పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్ట్ అండ్ కల్చరల్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కళా నైపుణ్యాలు, సాంస్కృతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసానికి ఇవి దోహదపడతాయన్నారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలని సూచించారు.
అనంతరం ఆర్ట్, క్రాఫ్ట్, సంగీతం, నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు రమేష్, గుర్రాల వెంకటేశ్వర్లు, రామస్వామి, పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసుల అవగాహన

కెరమెరిలో ఓపెన్‌హౌస్.. మోడీ కేజీబీవీలో వ్యాసరచన పోటీలు

జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 28: విద్యార్థుల్లో పోలీస్ శాఖపై అవగాహన పెంపొందించడంతోపాటు సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించేందుకు కెరమెరి మండలంలో రెండు కార్యక్రమాలు నిర్వహించారు. కెరమెరి పోలీస్‌స్టేషన్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఫిజికల్ ఓపెన్‌హౌస్ నిర్వహించగా, మోడీ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో వ్యాసరచన పోటీలు చేపట్టారు.

పోలీస్‌స్టేషన్ పనితీరుపై అవగాహన

కెరమెరి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్‌హౌస్‌లో పోలీసుల విధులు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించారు. ఆధునిక పోలీసింగ్‌లో ఉపయోగించే ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్, సీసీటీవీ నిఘా, ఫింగర్‌ప్రింట్ గుర్తింపు వ్యవస్థ, షీ టీమ్స్, భరోసా కేంద్రం, పోర్టెయిట్ పార్లే, బీట్ సిస్టమ్ పనితీరును తెలియజేశారు. నేరాల గుర్తింపు, నియంత్రణతోపాటు మహిళలు, చిన్నారుల రక్షణలో ఈ వ్యవస్థల ప్రాధాన్యాన్ని వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో వంచుకోవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో 112 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై వ్యాసరచన....

మోడీ గ్రామంలోని కేజీబీవీలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసుల పాత్ర, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌరుల బాధ్యతలను వివరించారు. అనుమానాస్పద లింకులు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను గుర్తుతెలియని వ్యక్తులతో వంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక అనర్థాలను తెలియజేస్తూ, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా విద్యపై దృష్టి సారించి, లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. సైబర్ నేరాల నివారణకు పోలీసులకు సహకరించాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం, పోలీస్ శాఖపై నమ్మకాన్ని బలోపేతం చేయడం, సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు,మోడీ కేజీబీవీ ప్రత్యేక అధికారిని (ఎస్వో) ప్రవీణ,కానిస్టేబుల్ రవీందర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు







నాగేందర్‌బాబు, వినోద్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జననినాదం,సిర్పూర్ (యు) 28: విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిర్పూర్ (యు) పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసుల విధులు, ప్రజల రక్షణలో వారి పాత్రను వివరించారు. పోలీసు శాఖలో వినియోగించే ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, నేర పరిశోధనలో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన పెరగడంతోపాటు ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు బలోపేతమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమయ్య, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు కార్లే ప్రకాష్,

గ్రామీణ రహదారులూ అధ్వానం..

సరండీ, ఇందాని రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి..

కొలం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆత్రం జలపతిరావు డిమాండ్

జననినాదం,వాంకిడి,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: వాంకిడి మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారి ప్రజలకు రాకపోకలు కష్టతరంగా మారాయని కోలాం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆత్రం జలపతిరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరండి ప్రధాన రహదారితో పాటు దాబా, సోనామూర్, ఇందాని, ఖోడేగావ్ గ్రామాలకు వెళ్లే రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. సరండి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందని పేర్కొన్నారు. ఈ దారి మీదుగా పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, రహదారి పొడవునా గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు సైతం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రహదారి సౌకర్యాలు ఎంతో కీలకమని జలపతిరావు పేర్కొన్నారు. రోడ్లు బాగుంటేనే ప్రజలు విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు ఇతర అవసరాల కోసం సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోగలరని తెలిపారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల ప్రజలు రవాణా పరంగా ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రహదారులపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారుల పరిస్థితిని పరిశీలించాలని కోరారు. సరండి ప్రధాన రహదారితో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే మార్గాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని ఆత్రం జలపతిరావు కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించి, ప్రజల ప్రయాణ కష్టాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఓటు హక్కును కాపాడుకోవాలి...

ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం
వచ్చే నెల 1న ఢిల్లీలో 'ఓట్ బచావో -- దేశ్ బచావో'
ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ అన్నారు. నవంబరు 1న న్యూఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్, కార్యక్రమ సమన్వయకర్త శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటరు హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి..

ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఓటరు జాబితాలో అక్రమాలు, అవకతవకలు జరగకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు.

ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ..

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాంనాయక్ మాట్లాడుతూ.. ఓటరు హక్కుల పరిరక్షణపై చేపడుతున్న అభియాన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.
బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపణ



అనంతరం మీడియాతో మరియప్పన్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే ఓటరు జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ కోట్లాది మంది ఓటర్ల హక్కులను ప్రమాదంలోకి నెట్టివేశారని, బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వనిచేస్తున్నారని ఆరోపించారు. అందుకే ప్రధాని మోదీ ఆయనను కాపాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ బీఎల్ఏ-2లు, పార్టీ నియమించిన ఎస్ఐఆర్ సమన్వయకర్తలు నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని, నవంబరు 1న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పలువురు నాయకుల హాజరునమావేశంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కుంరం మంతయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రాన్, మండల అధ్యక్షుడు రావర్తి మురళి, ఆర్జీఏఆర్ఎస్ జిల్లా కన్వీనర్ కోవా ఇందిరతో పాటు పలువురు కౌన్సిలర్లు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో పాంచజన్య సంకల్ప సభ

పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు

జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు), అక్టోబర్ 28: ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, రైతు సంక్షేమం, సామాజిక తెలంగాణ లక్ష్యాల సాధనకు ఈ నెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ'ను విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడు కిరిమిళ్ళ వినోద్ చారి పిలుపునిచ్చారు. కెరిమెరి మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద కవితక్క నాయకత్వంలో నిర్వహించనున్న ఈ భారీ బహిరంగ సభ ద్వారా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సామాజిక తెలంగాణ సాధన, రాజ్యాధికారంలో ఆయా వర్గాలకు తగిన భాగస్వామ్యం కల్పించే అంశాలపై సంకల్పం తీసుకోనున్నట్లు నాయకులు తెలిపారు. కెరిమెరి మండలంతోపాటు ఆసిఫాబాద్ జిల్లా నుంచి ప్రజలు, యువత, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటి మనోహర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మహుల్కర్ అశోక్, జాయింట్ సెక్రటరీ నర్సింగోజు సాయికుమార్ చారి, పెందూర్ ధర్ము, రాష్ట్ర బంజారా విభాగ నాయకుడు బానోత్ కిషన్ నాయక్, బీసీ విభాగం అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్, మహిళా విభాగ నాయకురాలు ధరావత్ పుష్పలత, ఎస్సీ సెల్ నాయకుడు దుర్గం శ్యామ్ రావు, అరుణ్, ఇంద్రజిత్, కోట్నాక రాము, షడుముక జంగు తదితర టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నైతం రాజు సంస్మరణ సభను జయప్రదం చేయండి

ప్రజాసంఘాల నాయకుల పిలుపు

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రాజు సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రేపు సభ నిర్వహించనున్నట్లు టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెజ్జూర్ మండలంలోని మారుమూల సోమిని గ్రామంలో జన్మించిన నైతం రాజు 2015లో టీఏజీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. 2016, 2017 సంవత్సరాల్లో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం నిర్వహించిన మహాజన పాదయాత్రలో సభ్యుడిగా పాల్గొన్నారని గుర్తు చేశారు. జిల్లాలో జరిగిన పలు ఆదివాసీ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న నైతం రాజు అనారోగ్యంతో అక్టోబరు 12న తుదిశ్వాస విడిచారని తెలిపారు. సంస్మరణ సభకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్.వి.రమ, మహాజన పాదయాత్ర బృందం సభ్యుడు,



ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.రమణ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నగేష్ హాజరై ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఆదివాసీలు, ప్రజానంఘాల నాయకులు, నైతం రాజు బంధువులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోట శ్రీనివాస్ కోరారు.
ఈ సమావేశంలో సిర్పూర్ పేపర్ మిల్స్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి కూశన రాజన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.రాజేందర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, జిల్లా అధ్యక్షుడు గేడెం టికానంద్, జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాను 'సురక్షిత్ ప్లస్' దిశగా తీసుకువెళ్లేందుకు సమన్వయంతో కృషి చేయాలి

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 28: మొబిలైజేషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా 'సురక్షిత్' హోదాను సాధించడం అభినందనీయమని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్మాన్ సమా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ సురక్షిత్ హోదాను సాధించడంలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'సురక్షిత్ ప్లస్' హోదాను సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో మొబిలైజేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ శాఖలు, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సమిష్టి కృషితో జిల్లాకు గుర్తింపు లభించిందని తెలిపారు. సాధించిన ప్రగతిని కొనసాగిస్తూ, హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ చర్యలను మరింత విస్తృతం చేయాలని, ప్రజలకు అవసరమైన



అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించడం ద్వారా జిల్లాను 'సురక్షిత్ ప్లస్' హోదా దిశగా తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం జిల్లాలో 'సురక్షిత్' హోదా సాధించేందుకు విశేష కృషి చేసిన పలువురు సిబ్బందిని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఎంఓ వెంకటేశ్వర్లు, దిశ సిపి ఎం ఎ.నీలిమ, దిశ సిఎస్ఓ రాజేష్, డిఎండిఓ సంతోష్, ఎల్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 28: భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి., తహసిల్దార్లతో భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి సి ఎల్ ఏ ఆదేశాల మేరకు భూదాన్ భూములకు సంబంధించిన దాన పత్రాలు, పంపిణీ పత్రాలను గుర్తించి, భూదాన్ చట్టం ప్రకారం నిర్దేశించిన ఫార్మాట్లలో వివరాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. భూ సంబంధిత కోర్టు కేసుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన కౌంటర్లు దాఖలు చేయాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాలను సమకూర్చుకొని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జి.ఓ. నంబర్ 59, 76 లకు సంబంధించి ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భూ భారతి పోర్టల్ ద్వారా అందిన పాత, కొత్త ఫార్మాట్లలోని పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి, సంబంధిత రికార్డుల ఆధారంగా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాత ఫార్మాట్‌లో



పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నవంబర్ 10వ తేదీలోగా పరిష్కరించాలని తెలిపారు. కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన వరిశీలించి వరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా గణాంక/ప్రణాళిక అధికారి పాపయ్య లతో కలిసి డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య ఆధ్వర్యంలో ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు నిర్వహించిన జనగణన సంబంధిత 2 రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన నిర్వహణకు సంబంధించి శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని వివరాలు, రికార్డులతో సిద్ధంగా ఉండాలని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంగుబాయి పుణ్యక్షేత్రానికి వెళ్తూ లోయలోకి జారిన ఆటో

తృటిలో తప్పిన పెను ప్రమాదం..

ప్రయాణికులు సురక్షితం అధ్వానంగా ఘాట్ రోడ్డు.. నిలిచిపోయిన అభివృద్ధి పనులు

జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు),అక్టోబర్ 28: జంగుబాయి పుణ్యక్షేత్రానికి వెళ్తున్న గిరిజనుల ఆటో ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి జారింది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాపాయం నుంచి బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన కెరమెరి మండలంలోని ఘాట్ రోడ్డు దుస్థితిని మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఆసిఫాబాద్ పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు మొక్కులు చెల్లించుకునేందుకు తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దులోని మహారాజ్‌గూడ దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన జంగుబాయి దేవత దర్శనానికి ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో లి ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఆటో బ్రేకులు పనిచేయక వెనక్కి లోయవైపు జారింది. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో ఆటోను నిలిపివేయడంతో ప్రమాద తీవ్రత తప్పింది.

స్థానికుల సహకారంతో ఆటో బయటకు..

అదే సమయంలో అటుగా వెళ్తున్న ముఖద్దంగూడ మాజీ సర్పంచ్, ప్రస్తుత ఉపసర్పంచ్ పతంగే లింబాదాస్ ఈ ఘటనను గమనించారు. వెంటనే సమీప గ్రామాలకు చెందిన పలువురి సహాయంతో లోయలోకి జారుకున్న ఆటోను బయటకు తీశారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో





ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏళ్లుగా నిలిచిన రోడ్డు పనులు..

ఉమ్రి నుంచి పరందోలి వరకు రహదారి పనులు కొన్నేళ్లుగా నిలిచిపోవడంతో రోడ్డుపై కంకర తేలి, గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డులో వాహనాలు నడపడం కష్టంగా మారిందని, ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రహదారి దుస్థితి కారణంగా గతంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం..

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని సమీప గ్రామాల ప్రజలు గతంలో పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉమ్రి నుంచి పరందోలి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
గంజాయి, గుడుంబా విక్రయాలపై నిఘా
పెండింగ్ కేసులు లేకుండా చూడాలి
ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి
సిరికొండ పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ

జననినాదం,సిరికొండ 28: పోలీసు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా క్రమశిక్షణతో పనిచేయాలని ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి సూచించారు. బుధవారం సిరికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, వాహనాల స్థితిగతులు, పరిశుభ్రతను పరిశీలించారు. సిబ్బంది విధుల పట్టిక, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం చేయకుండా, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. మండలంలో గంజాయి, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని



ఆదేశించారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని కేటాయించి, గ్రామాల్లోని పరిస్థితులపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. చిన్నపాటి నేరాలను సైతం ప్రారంభ దశలోనే అరికట్టాలని తెలిపారు. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు విధులను సమర్థంగా నిర్వహిస్తూ నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయన పేర్కొన్నారు.

విధులకు డుమ్మా.. అర్హత లేని మహిళతో బోధన..!

తాటిగూడ ఐటీడీఏ పాఠశాల ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి
మానవ హక్కుల పరిరక్షణ సమితి, తుడుం దెబ్బ నాయకులు

జననినాదం,తిర్యాణి 28: విధులకు గైర్హాజరవుతూ.. అర్హత లేని మహిళతో ఆదివాసీ విద్యార్థులకు బోధన చేయిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల పరిరక్షణ సమితి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ కుర్సెంగ శోభన్, తుడుం దెబ్బ ఉమ్మడి మంగి అధ్యక్షుడు పంద్రం నగేశ్ అన్నారు. బుధవారం తిర్యాణి మండలంలోని ఉమ్మడి మంగి పరిధిలోని పలు గ్రామాల్లో వారు పర్యటించారు. తాటిగూడలోని ఐటీడీఏ సింగిల్ టీచర్ పాఠశాలను పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వసంతరావు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆరోపించారు. ఆయనకు బదులుగా విద్యార్హతలు లేని మహిళతో విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారని, ఆమెకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు



చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ పటేళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్ కాట్లే మంజుల మధుకర్, ఉపసర్పంచ్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఆదివాసీ విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిస్తున్న ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

పాంచజన్య సభను విజయవంతం చేయాలి

తెలంగాణ రక్షణ సేన మండల కన్వీనర్ సతీష్
పాంచజన్య సంకల్ప సభ పోస్టర్ల విడుదల

జననినాదం,సిరికొండ 28: పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన మండల కన్వీనర్ సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం సిరికొండ మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజలకు అండగా ఉంటారని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తూ సామాజిక న్యాయం ద్వారా అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరిగేలా



చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాంచజన్య సంకల్ప సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోంపల్లి రామారావు, రాజేశం సిందే, సాయినాథ్, తిరుపతి, సూర్యకాంత్, నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో విజేతలుగా సిర్పూర్ బాలికలు

జననినాదం, సిర్పూర్ (యు) 28: పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సిర్పూర్ (యు) తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల బాలికల వాలీబాల్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ మిట్ట వెంకటస్వామి అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. జట్టు విజయానికి కృషి చేసిన కోచ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీటీ ఆత్రం



ధర్మారావు, కనక ఆనంద్, రాహుల్ పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆపార్టీ రాష్ట్ర కిషన్ నాయక్

జననినాదం, జైనూర్ 28: టీఆర్ఎస్ పార్టీతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ కిషన్ నాయక్ అన్నారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలోని కేఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు, విద్యా, ఉపాధి రంగాల్లో అభివృద్ధి తమ పార్టీ లక్ష్యాలని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే టీఆర్ఎస్ బలోపేతం కావాలన్నారు. ఈ సందర్భంగా జైనూర్ మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువాలు కప్పుకొని టీఆర్ఎస్‌లో చేరారు. రానున్న రోజుల్లో ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి మరింత మంది పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని కిషన్ నాయక్ తెలిపారు. ఈ నెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పంచజన్య సంకల్ప సభకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారని చెప్పారు. వివిధ మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సభను



విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కే. మనోహర్, జిల్లా అధ్యక్షుడు కే. వినోద్ చారి, జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ అశోక్ మహోల్కర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గే శ్యామ్ సుందర్, సాయి చారి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ధరావత్ పుష్పలత, ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు కొట్నక కిషన్, పెందుర్తి ధర్మం, అరుణ్ మహోల్కర్, ఇంద్రజిత్ ఉప్రే, సోనీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న రాథోడ్ బాపురావు

జననినాదం,ఆదిలాబాద్ ప్రతినిధి 28: బోథ్ నియోజకవర్గం తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పూజల్లో పాల్గొన్నారు. ప్రశాంతమైన కొండపై కొలువైన శ్రీవారి ఆలయం వివిధ ప్రాంతాల భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి సంకల్ప సభ బోథ్ ఇన్‌ఛార్జి శ్రావణి,



మండల కన్వీనర్ నిమ్మల గజానంద్, గడుగు పోచ్చన్న, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో బస్సు ఆపరు.. అడిగితే ఫిర్యాదు చేసుకోమంటారు..!

మహిళలకు ఉచిత ప్రయాణం.. అడుగడుగునా అవమానాలు

మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఆర్టీసీ డ్రైవర్ల ఇష్టారాజ్యం

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 28: మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకానికి ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం తూట్లు పొడుస్తోంది. బస్టాండులో బస్సు ఆపాల్సింది పోయి.. ఎక్కడ పడితే అక్కడ నిలిపి వెళ్లిపోతుండటంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ వన్ డిపోకు చెందిన టీ ఎస్ 02 యు డి 7080 బస్సు మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని బస్టాండులో ఆపకుండా ముందే నిలిపి వెళ్లిపోవడంపై మహిళలు ప్రశ్నించగా.. 'మా కరీంనగర్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసుకోండి' అంటూ డ్రైవర్ దురుసుగా సమాధానమిచ్చినట్లు ఆరోపించారు. ఈ ఒక్క బస్సుతోనే సమస్య పరిమితం కాలేదని.. దాదాపు అన్ని బస్సుల డ్రైవర్లు బస్టాండుకు ముందుగానీ, దాటిన తర్వాతగానీ నిలుపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వ పథకం ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నా.. బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు మహిళలు నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు సేవలందించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రశ్నిస్తే బాధ్యతారహిత



సమాధానాలివ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు కళ్లు తెరిచి బస్టాండులోనే బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించే డ్రైవర్లపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 28: సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మానిటరింగ్ అధికారి అజయ్‌బాబు(సి.ఐ.) తో కలసి సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం బకాయిల వసూళ్లు, వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తాల చెల్లింపులు, ప్రస్తుత సీజన్ల సిఎంఆర్ ధాన్యం అప్పగింతలపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2019--20 సంవత్సరం నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024--25 వరకు పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. రబీ 2022--23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యానికి చెల్లించవలసిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని, ఖరీఫ్ 2025--26, రబీ 2025--26 సీజన్లకు సంబంధించిన సిఎంఆర్ డెలివరీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, జి.ఓ. ఎం.ఎస్. నం. 17 ప్రకారం నిర్ణీత గడువులోగా పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను పూర్తిగా చెల్లించాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బకాయిల చెల్లింపులలో జాప్యం చేయకుండా, ప్రభుత్వానికి చెల్లించవలసిన



మొత్తాలను సకాలంలో జమ చేయాలని తెలిపారు.అంతకుముందు జిల్లా ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 పై నిర్వహించిన ఆన్లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆహారత భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టం అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో చట్టం సమర్థవంతమైన అమలుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహసిల్దార్ (సివిల్ సప్లైస్), సంబంధిత రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములు, లీసర్వే, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 28: భూదాన్ భూములు, రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో భూధాన్ భూములు, రీ సర్వే ప్రక్రియ, కోర్టు కేసులు, భూ సేకరణ, జి.ఓం. 59, 76, 118 ల సంబంధిత పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, విజిలెన్స్, ఇంటలిజెన్స్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్



విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేపలు తినని వారికి గుడ్‌న్యూస్..

ఒమేగా 3 అందించే ఆహారాలు ఇవే!



గుండె పనితీరుని మెరుగ్గా ఉంచడం, నాడీ కణాలకు రక్షణ పొరను నిర్మించడం, రక్త నాళాల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్స్, క్యాల్షియం లాంటి వాటిని తీసేయడానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడతాయి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లోపం లేకుండా ఉండాలంటే చేపలు బాగా తినాలని చాలామంది సలహాలిస్తారు. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండేది నిజమే. కానీ, వాటిల్లోనే ఉంటుందని, అధికంగా ఉంటుందనేవి భ్రమలే. వంద గ్రాముల చేపలో 2.5 నుంచి 3 గ్రాములే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. మార్కెట్లో తక్కువ ధరలో ఉండే మెంతి కూర, మునగాకు, అవిసె గింజల్లో అంతకంటే ఎక్కువ మోతాదులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వంద గ్రాముల అవిసె గింజల్లో 22 గ్రాములు, చియా గింజల్లో 17 గ్రాములు, వాల్‌నట్స్‌లో 9 గ్రాముల వరకు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. కాబట్టి చురుకైన మెదడు, గుండె ఆరోగ్యం కోసం చేపలు తింటే మంచిది. తినకపోతే ప్రమాదం అనేది అవాస్తవం. ఏది తిన్నా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే ఆహారం వారానికి రెండు రోజులు తీసుకుంటే మంచిది. చేపలు తింటే గుండె ఆరోగ్యానికి మేలు అన్నది నిజమే. కానీ, చేపలు తినని వాళ్లకు నష్టమన్నదాంట్లో నిజం లేదు.

రాములమ్మ వ్యూహాత్మక మౌనం

హైదరాబాద్ , : తెలంగాణ రాజకీయాల్లో 'రాములమ్మ' విజయశాంతి పేరు వినపడితేనే ఒక రకమైన పవర్‌ఫుల్ పొలిటికల్ ఇమేజ్, పదునైన వ్యాఖ్యలు గుర్తుకొస్తాయి. వెండితెరపై లేడీ అమితాబ్‌గా ప్రసిద్ధి చెందిన ఆమె, తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రత్యర్థులపై తనదైన శైలిలో సింహగర్జన చేస్తూ వార్తల్లో నిలిచేవారు. బిఆర్ఎస్, బిజెపిలను దాటుకుని 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గూటికి చేరిన విజయశాంతికి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించి గౌరవించింది. అయితే పదవి దక్కిన తర్వాత కూడా గతంలో కనిపించిన ఆ రాజకీయ దూకుడు, నిరంతర క్షేత్రస్థాయి చురుకుదనం ఇప్పుడు లోపించాయనే చర్చ తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తోంది. 2023 ఎన్నికల సమయానికి ముందు బీజేపి వీడి హస్తం గూటికి వచ్చిన విజయశాంతికి ఎమ్మెల్సీ సీటు దక్కడంపై అప్పట్లో పార్టీలోని కొందరు సీనియర్లు, ఏళ్ల తరబడి పనిచేసిన నేతలు అంతర్గ తంగా అసంతృప్తి వ్యక్తం చేశారనే ప్రచారం ఉంది. అయినప్పటికీ అధిష్టానం ఆమెకు ప్రాధాన్యత ఇచ్చి శాసనమండలికి పంపింది. అయితే పదవి లభించిన తర్వాత పార్టీ అధిష్టానం, పీసీసీ సమాయత్తం చేసే కీలక కార్యక్రమాలలో, నిరసనల్లో లేదా ప్రభుత్వ మైలేజ్ ప్రచారాల్లో విజయశాంతి పెద్దగా కనిపించకపోవడం గమనార్హం. పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చే ప్రధాన సభలకు కూడా ఆమె గైర్హాజరవ్వడం వెనుక అంతర్గత అనంతృప్తి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే విజయశాంతి మౌనం అంటే ఆమె పూర్తిగా రాజకీయాలకు దూరమైనట్లు భావించడానికి వీల్లేదు. పార్టీ వేదికలపై నేరుగా మాట్లాడకపోయినప్పటికీ.. సోషల్ మీడియా ద్వారా ఆమె నిరంతరం క్రియాశీలకంగానే ఉంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పోలీసు వ్యవస్థలో సవాళ్లు వంటి సున్నితమైన ప్రజా సమస్యలపై ఆమె



స్పందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ వ్యాఖ్యలు పరోక్షంగా సొంత కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనకే సూచనలు లేదా ప్రశ్నించే ధోరణిలో ఉండటం కాంగ్రెస్ శ్రేణుల్లో విభిన్న చర్చలకు దారితీస్తోంది. విజయశాంతి కేవలం ఒక సాధారణ ఎమ్మెల్సీ పాత్రకే పరిమితం కాకుండా, పార్టీలో తనకు తగినంత కార్యనిర్వాహక ప్రాధాన్యత లేదా నిర్ణయాత్మక హోదా దక్కలేదనే భావనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ యంత్రాంగంతో ఆమెకు స్పష్టమైన సమన్వయ లోపం ఉందా, లేక తనకు తానుగా ఒక డిస్టెన్స్ మెయింటెన్ చేస్తున్నారా అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారికంగా ఆమె నుంచి సమాధానం రాలేదు. దీంతో ఆమె హాజరు కాకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ముగింపుగా చెప్పాలంటే.. విజయశాంతి పాటిస్తున్న ఈ నిశ్శబ్దం కేవలం తాత్కాలిక వ్యూహాత్మక విరామమా లేక కాంగ్రెస్ పార్టీ తీరుపై నిశ్శబ్ద నిరసనా అనేది త్వరలోనే తేలనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పదిహేను నెలల పాలన పూర్తి చేసుకుని స్థానిక పోరుకు సిద్ధమవుతున్న తరుణంలో.. రాముల మ్మ మళ్లీఎప్పుడు తన గళాన్ని విప్పుతారు, ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోబోతున్నారు అనేది రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

సిద్ధమవుతున్న టిమ్స్

హైదరాబాద్, : హైదరాబాద్‌లోని సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో త్వరలో శస్త్రచికిత్స సేవలు దశలవారీగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఔట్‌పేషెంట్ సేవల ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి, ఇకపై ఆపరేషన్లు, అత్యాధునిక ఇన్‌పేషెంట్ చికిత్సలను కూడా అందించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది రోగులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన ప్రభుత్వ వైద్యశాలల్లో పెరుగుతున్న రోగుల రద్దీని తగ్గించడంతోపాటు, అవసరమైన వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ విస్తరణ దోహదపడనుంది.ఆపరేషన్ థియేటర్లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తవడంతోపాటు, వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టడంతో శస్త్రచికిత్స సేవల ప్రారంభానికి మార్గం సుగమమైంది. ఆగస్టులోనే ప్రారంభమైన ఈ ఆసుపత్రికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను మరింత విస్తరించి, శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు కూడా చికిత్స అందించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.సుమారు రూ.1,126 కోట్ల వ్యయంతో 53 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో మొత్తం 1,082 పడకలు ఉన్నాయి. వీటిలో 300 పడకలను ఐసీయూ సేవల కోసం కేటాయించారు. అలాగే 31 ప్రధాన ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. భారీ వైద్య మౌలిక సదుపాయాలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే రాష్ట్ర ప్రభుత్వ వైద్య రంగంలో కీలకమైన మార్పు వచ్చే అవకాశముంది. అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు అదనపు వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.శస్త్రచికిత్స సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆసుపత్రి మరింత ఎక్కువ సంఖ్యలో కేసులను నిర్వహించగలదని టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఏ. నరేంద్ర తెలిపారు. దీనివల్ల ప్రస్తుతం అధిక రోగుల భారాన్ని ఎదుర్కొంటున్న ఇతర ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుందని, రోగులకు సకాలంలో చికిత్స అందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అయితే, అన్ని శస్త్రచికిత్స సేవలను ఒకేసారి ప్రారంభించకుండా దశలవారీగా విస్తరించనున్నారు. ఆపరేషన్ థియేటర్లు, వైద్య బృందాలు, సహాయక విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్న కొద్దీ ఆపరేషన్ల సంఖ్యను పెంచనున్నారు. అదనపు ఐసీయూ పడకలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రావడం వల్ల శస్త్రచికిత్సల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఆసుపత్రి సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి వస్తే హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు కూడా మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.హైదరాబాద్‌లో వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడిగా పనిచేస్తున్న సురేశ్ చీకట్ల కుటుంబానికి గ్రామంలో 35 ఎకరాలకు పైగా భూమి ఉంది. గత ఏడాది తమ పొలంలో సుమారు 900 బస్తాల ధాన్యం పండిందని, ఒక్కో బస్తా 40 కిలోల చొప్పున మొత్తం 405 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ.. బోరుబావుల నిర్వహణలో తీసుకున్న జాగ్రత్తలతో సుమారు 750 బస్తాల దిగుబడిని ఆశిస్తున్నట్లు చెప్పారు.

సబ్బితంలో బీఆర్ఎస్‌కు షాక్..

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు!

అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌లో చేరికలు
కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు





పెద్దపల్లి, అక్టోబర్ 28:సబ్బితం:(నేటి ఇజం): పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బితం గ్రామానికి చెందిన చుంచు సదయ్య (మాజీ సర్పంచ్), మదాసి శ్రీనివాస్ (మాజీ ఉపసర్పంచ్), చుంచు చిన్న పెద్దులు (మాజీ ఉపసర్పంచ్), పులిపాక మనోజ రాజయ్య, ఇండ్ల నాగతేజశ్విని–రమేష్, గుమ్మడి రాజేంద్ర ప్రసాద్, ఆకుల సతీష్ కుమార్ (వార్డు సభ్యులు), చెప్పాల రాజేశం (మాజీ వార్డు సభ్యుడు), పేరుక పోచాలు (కాపు సంఘం అధ్యక్షుడు), చుంచు సారయ్య, చుంచు సంపత్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్బితం గ్రామ సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, సింగిల్ విండో చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్





జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 28: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6, 7, 2, 27, 28, 26వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మేయర్ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, కొండ్ర రాజేశ్వరి లింగయ్య, అమృత్ రాజ్ కుమార్, గుమ్మడి శ్రీనివాస్, తోటపల్లి రాజేశ్వరి, వనపర్తి కేత రాజేష్, ఇరగదిండ్ల రవి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు అంగిడి రాజేష్, బత్తుల స్వామి, మారు మల్లయ్య, కొత్త రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



హత్నూర,అక్టోబర్ 28 : గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల వద్దకు వచ్చే ధాన్యాన్ని రైతులకు ఇబ్బందులు కలుగకుండా వెంట వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్, చందాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత కొనుగోల సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కరెంటు సమస్య వల్ల రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగుచేసిన పంట కళ్లముందు ఎండిపోతుంటే దిక్కుతోచని స్థితిలో నేడు రైతన్నలు పడ్డారని తెలిపారు. ప్రభుత్వం వర్షాభావ పరిస్థితుల వల్ల యాసంగి పంటలు సాగు చేయవద్దని సూచించడంతో రైతులకు ఆర్థిక సాయంగా ఎకరాకు 30 వేల పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, సర్పంచ్లు రాధా రమేష్, రామరాజు, ఎల్లయ్య, ఉపసర్పంచ్ రాజ మల్ల రెడ్డి, ఆగమయ్య, కృష్ణ యాదవ్, ఇబ్రహీం, నరేందర్, రవీందర్,వీరేందర్, ఎల్చాల మధు,రవి కుమార్, కుమార్ అజ్మత్ అలీ,సురేందర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైద్యరంగం నిర్వీర్యం


ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



కోరుట్ల అక్టోబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైద్య, ఆరోగ్యం పూర్తిగా నిర్వీర్యమైంది అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. అంగట్లో అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్న చందంగా ప్రభుత్వ దవాఖానలు మారిపోయాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అధునాతన దవాఖానలను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఏరియా హాస్పిటల్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు దవాఖానలోని ప్రధాన విభాగాలైన డయాలసిస్ సెంటర్, ఇన్ పేషంట్, ప్రసూతి విభాగం, ఆపరేషన్ థియేటర్, చిన్నపిల్లల వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దవాఖాన వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దవాఖానకు వచ్చే రోగులతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచనలు చేశారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని, సాకులు చెప్పవద్దని, అంకిత భావంతో పని చేయాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో వైద్య ఆరోగ్య రంగం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కోరుట్ల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ని బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ. 14 కోట్ల వ్యయంతో వంద పడకల దవాఖానగా ఆధునికరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో 100 పడకల హాస్పిటల్ ఇప్పుడు ప్రాథమిక హాస్పిటల్ కన్నా దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధునాతన హాస్పిటల్‌ల భవనంలో కోట్లాది రూపాయలు వైద్య పరికరాలు తుప్పు పట్టి పోతున్నాయన్నారు. దవాఖానలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్పిటల్‌కు అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు దారిశెట్టి రాజేష్, పహీం, మహేష్, నరేష్, సురేందర్, వసీం, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయవాదులతో సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



హైదరాబాద్,: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయానికి కృషి చేయాలని వారు కోరారు. సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా తమ వంతు పాత్ర పోషించే న్యాయవాదులు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌తో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ బిందు, మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్లు మార్నేని వెంకన్న,ఎండీ ఫరీద్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు సమావేశానికి హాజరై ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు తమ మద్దతు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమస్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి: సీపీ అంబర్ కిషోర్ ఝా





జైపూర్, అక్టోబర్ 28: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అందించే రక్తం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రక్తదానం సమాజానికి ఎంతో మేలు చేసే గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో ఎస్సై భూమేష్‌తో పాటు పోలీస్ అధికారులు, గ్రామ సర్పంచ్, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై భూమేష్, ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ బైక్‌పై..

సీపీ పెట్రోలింగ్

మంచిర్యాలలో ఆకస్మిక తనిఖీలు



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 28: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అర్ధరాత్రి వేళ బైక్‌పై పెట్రోలింగ్ నిర్వహించారు. మంచిర్యాల పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా, భద్రతా చర్యలను స్వయంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతా భావం కల్పించేలా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి ముప్పు

అచ్చంపేట : ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది చలికాలంలో ఎండలు ముందుగానే తీవ్రం కావడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేట మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించగా, ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కీలక సూచనలు చేశారు. ప్రధానంగా నీటి పొదుపు తప్పనిసరని, ఎల్ నినో కారణంగా రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు తాగునీటిని, సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని, ప్రతి చుక్క నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత పెరిగితే విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతుందని, అనవసరంగా లైట్లు, మోటార్లు వేయకుండా విద్యుత్‌ను అదా చేయాలని కోరారు.

జీవనోపాధి పై అటవీ శాఖ ఆంక్షలు.. రోడ్డెక్కిన దసలి రైతులు



చెన్నూర్ అక్టోబర్ 28: మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేట సమీప అటవీ ప్రాంతంలో దసలి పట్టు పురుగుల పెంపకం చేసుకుంటున్న దసలి రైతులకు అటవీ శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తూ, ఇబ్బందులు సృష్టిస్తూ జీవనోపాధికి ఆటంకం కలిగిస్తున్నారని రైతులు బుధవారం జాతీయ రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పట్టు పురుగుల పెంపకం చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంతంలో పట్టు పురుగుల పెంపకం కొనసాగించకూడదంటూ అటవీ ప్రాంతంలోకి వెళ్లే దారిని మూసివేయడంతో ఆర్థికంగా నష్టపోవడంతో పాటు జీవనోపాధి కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దసలి రైతులు నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. దసలి రైతుల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా అధికారులు స్పందించి, తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. దసలి రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో స్థానిక ఎస్సై శ్యామ్ పటేల్ చొరవ తీసుకుని రైతులను

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293. **Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197